క్లుప్తంగా

ఘనంగా బాట్లమ్మ విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజలు అందుకుంటున్న బాట్లమ్మ

తాడిమర్రి: దాడితోటలో బాట్లమ్మ విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజారి శ్రీనివాసులు శర్మ అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు, వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు (గుడికట్టుదారులు) పాల్గొని అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నాగిరెడ్డిగారి, కోనంకిగారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వారపు సంతకు రేపు వేలం పాట

తనకల్లు: వారపు సంతతోపాటు పంచాయతీ కాంప్లెక్స్ రూముల అద్దె కోసం గురువారం తనకల్లు పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. సదరు వ్యక్తులు పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదన్నారు. ఆసక్తి కలవారు గ్రామ సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కేంద్ర మంత్రులను కలిసిన చింతా



కేంద్ర మంత్రితో చింతా శరత్‌కుమార్‌రెడ్డి

కదిరి టౌన్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, శ్రీభూపతిరాజు, శ్రీనివాసవర్మను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్ కుమార్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. రాబోవు రోజుల్లో కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి ఏపీలో వ్యవసాయ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో అమడగూరు మండల అధ్యక్షుడు ఇందుకూరి నరేంద్రరెడ్డి ఉన్నారు.

సజావుగా సబ్సిడీ వేరుశనగ పంపిణీ

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, పెద్దకోట్ల రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ సజావుగా సాగింది. రెండు రైతు భరోసా కేంద్రాల్లోనూ కలిపి 128 మంది రైతులకు 1114.6 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఏఓ రమాదేవి తెలిపారు. వేరుశనగతో పాటు కంది, అలసంద, పెసర తదితర వాటిని అంతర పంటలుగా సాగు చేసుకుంటే అధిక ఆదాయం గడించొచ్చునని తెలిపారు. మేరసాలల్లో ఆముదం, జొన్న, సజ్జ సాగు చేసుకుంటే వేరుశనగ పంటను చీడపీడలు ఆశించవని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, వీహెచ్ఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు



బత్తలపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు.

అంకితభావంతో పనిచేయండి



ఓడీసీలో ఆశాడేలో పాల్గొన్న ఆశా వర్కర్లు

ఓడీచెరువు: ఆశా వర్కర్లు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ నాగేంద్రనాయక్ సూచించారు. ఆశా డే సందర్భంగా మంగళవారం ఓడీచెరువు పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశా వర్కర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్, సబ్ యూనిట్ ఆఫీసర్ దేవ్లానాయక్, సూపర్‌వైజర్ శశిధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం





మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, అవగాహన సదస్సుకు హాజరైన వీఆర్వోలు, మహిళా పోలీసులు, సచివాలయాల సిబ్బంది

- అమ్మాయి చదువు ఇంటికి వెలుగు
- బాలికల హక్కులు కాపాడాలి
- ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి సూచించారు. ఆర్డీఓ సమావేశ భవనంలో మంగళవారం ధర్మవరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాల నియమ నిబంధనలు, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టంపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, సీడీపీఓ లక్ష్మి హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల రహిత రెవెన్యూ డివిజన్‌గా ధర్మవరాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. బాల్య వివాహాలు నిలుపుదల చేయడానికి జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులను నియమించారన్నారు. అమ్మాయి చదువు ఇంటికి వెలుగునిస్తుందన్నారు. బాలికల హక్కులను కాపాడాలని, బాలల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. బాలలపై లైంగిక దాడులు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టంలోని అంశాలను వివరించారు. శివారు కాలనీలు, గ్రామాల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, పరిరక్షణ అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, ఎక్స్‌టెన్షన్ అధికారులు శాంతి, కౌసల్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సచివాలయాల అడ్మిన్‌లు, వార్డు వీఆర్వోలు, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారి వరప్రసాద్

కదిరి టౌన్: విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ అధికారి వరప్రసాద్, సీఐ పుల్లయ్య సూచించారు. రాష్ట్రీయ చలాక్ ఏక్తా మహా మంచ్ దేశీయ డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీ మహల్‌లో మంగళవారం మహా సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవాణా శాఖ అధికారి వరప్రసాద్, సీఐ పుల్లయ్య హాజరై డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంతకు ముందు డ్రైవర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్లకు ఉత్తమ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ చలాక్ ఉక్తా మహా మంచ్ ట్రేడ్ యూనియన్ సభ్యులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా మురళీకుమార్

తనకల్లు: మండల కేంద్రం తనకల్లులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన మేనేజర్‌గా మురళీకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు



చెన్నరాయపట్నంలో పొలానికి సేంద్రియ ఎరువులను తరలిస్తున్న రైతులు

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు మూడు దఫాలుగా పదునైన వర్షం కురవడంతో దుక్కులు చేస్తున్నారు. విత్తనం వేసే సమయం సమీపిస్తుండటంతో రైతులు పొలాల్లోని కంది కొయ్యలు సేకరించుకుంటున్నారు. సేంద్రియ ఎరువులను తోలుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లోని మహిళలు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. వారంలో వర్షం కురిస్తే వేరుశనగ, కంది, ఆముదం, అలసంద విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయా గ్రామాల రైతులు అంటున్నారు.

నీట్ యూజీ పరీక్ష రద్దు చేయాలి

- పరీక్ష తిరిగి నిర్వహించకపోతే ఎంపీలు, మంత్రుల ఇళ్లు ముట్టడిస్తాం
- విద్యార్థి సంఘం నాయకుల హెచ్చరిక



నిరసన తెలుపుతున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం అర్బన్: నీట్ యూజీ -2024 పరీక్ష ఫలితాలు తప్పుల తడకగా ఉన్నందున వాటిని వెంటనే రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర మంగళవారం పీఎస్‌యూ నాయకులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. నరేంద్ర మాట్లాడుతూ ఈ నెల 4న విడుదలైన నీట్ యూజీ ఫలితాల్లో 67 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. అందులో 8 మంది విద్యార్థులు ఒకే సెంటర్‌కు చెందిన వారు ఉండటం గమనార్హమని తెలిపారు. పరీక్షలో కొంత మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారన్నారు. నీట్ పరీక్షలో ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, తప్పు సమాధానానికి ఒక నెగిటివ్ మార్కు ఉంటుందన్నారు. 720 పూర్తి మార్కులు సాధించిన విద్యార్థులు 68 మంది ఉన్నప్పుడు దాని తర్వాత వచ్చే ర్యాంకుల విద్యార్థులు వారి పూర్తి స్కోర్ ఒక ప్రశ్నకు సమాధానం అసలే ఇవ్వకపోతే 716 మార్కులు సాధించి ఉండాలి. లేదా ఒక ప్రశ్నకు తప్పు సమాధానం ఇస్తే 715 మార్కులు వచ్చి ఉండాలన్నారు. కానీ తర్వాతి ర్యాంకులలో వచ్చిన విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారన్నారు. దేశంలో జరిగిన అతిపెద్ద పరీక్ష స్కామ్ ఇది అని ఆరోపించారు. ఈ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, లేనిపక్షంలో నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు నందకిషోర్, నాయకులు మోహిత్, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆశావర్కర్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఎస్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యలు వివరించాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అప్రమతంగా ఉండాలన్నారు. గర్భిణులకు అందుబాటులో ఉండి వారికి డాక్టర్ సలహాలను తెలియజేస్తూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు.

కనగానపల్లి: కలుషిత ఆహారాన్ని తినటం వల్లనే అతిసారం ప్రబలుతుందని కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలం ఆరంభంలో ప్రబలే అతిసారం నివారణ చర్యలపై ఆశా వర్కర్లకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవటంతో పాటు రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందజేయాలన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హడలెత్తించిన కూరగాయల ధరలు



వారపుసంతలో కూరగాయలు

గాండ్లపెంట: రెక్కమానులో మంగళవారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయలు, ఆకుకూరల ధరలు భగ్గుమన్నాయి. టమాట కిలో చిన్నవి రూ.40, పచ్చిమిర్చి రూ.120, బెండ రూ.60, యర్రగడ్డలు రూ.50, కాకర రూ.60 ఇలా ఏది తీసుకున్నా ధరలు ప్రజలను హడలెత్తించాయి. కొత్తిమీర కట్ట రూ.60 పలికింది. మెంతికూర చిన్న కట్ట రూ.10, శిర్యాకు కట్ట, గోంగుర కట్ట రూ.10కు విక్రయించారు. అనపకాయలు కిలో రూ.100 ఎగబాకింది. పంటలు పండించిన రైతు వద్దకు వచ్చే సరికి గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారని సామాన్య, మధ్యతరగతి ప్రజలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జనజాగృతి సిబ్బంది

తనకల్లు: జనజాగృతి సంస్థ ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం గొవ్విళ్లపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని రైతులు పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 19 గ్రామాల్లో 1,368 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. అజీజ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థికసాయంతో హసన్ సహకారంతో ఈపీఆర్‌ఏ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే బీడు భూములు, వంకలు, కుంటలు, చెరువులను గుర్తించామన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం





అలంకరణలో గంగమ్మ తల్లి, జ్యోతులు ఎత్తుకుని తరలివచ్చిన భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

హిందూపురం: పట్టణంలోని కోటిపిరోడ్డు మోడల్ కాలనీలో వెలసిన గంగమ్మ తల్లి జ్యోతుల ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బెస్తసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకొకసారి ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే నిర్వహించిన ఉత్సవానికి హిందూపురం పరిసరా ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. లక్ష్మిపురంలోని భజన మందిరం నుంచి మేళతాళాలతో అమ్మవారికి జ్యోతులను ఎత్తుకుని మోడల్ కాలనీ వరకూ తరలివచ్చి జ్యోతులను గంగమ్మ గుడిలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు ఆలయంలో అల్పాహారం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, సెరికల్చర్ జేడీ లక్ష్మీనారాయణ, బెస్త సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శివయ్య, కోశాధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో వర్షం



జలమయమైన రెవెన్యూ కాలనీ

కదిరి టౌన్: పట్టణంలో మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో వర్షం కురిసింది. వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ వర్షానికి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ప్రమాణ స్వీకార వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టరేట్

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం పది గంటల నుంచి ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించడానికి అధికార యంత్రాంగం మున్సిపల్ కేంద్రాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విస్తృతంగా భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కృష్ణాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, సారాంశ అనుబంధ గంథాల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు విశ్వమూర్తి, సురేష్, రత్నమాచారి, తులసి, ప్రభావతమ్మ, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ఆరా



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీలత

గాండ్లపెంట: కదిరి డీఎస్పీ శ్రీలత మంగళవారం గాండ్లపెంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతల గురించి ఆరా తీశారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ



ఈఓ రవీంద్రరాజు

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ నూతన ఈఓగా సి.రవీంద్రరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో అనంతపురంలోని గంగమ్మ ఆలయంలో ఈఓగా పని చేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు.

సివిల్ సప్లయ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కదిరి టౌన్: కదిరి డివిజన్ పరిధిలోని సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ తెలిపారు. కదిరి, ముదిగుబ్బ, గాండ్లపెంట, తనకల్లు, ఓడీసీ మండలాల్లోని స్టాక్ పాయింట్ల హమాలీల జనరల్ బాడీ సమావేశం కదిరి స్టాక్ పాయింట్ వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడారు. హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా డీలర్ల నుంచి వస్తున్న కూలి చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్, వాచ్‌మెన్లకు ఏడు నెలలుగా జీతాలు అందలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జీఎల్ నరసింహులు, పట్టణ కార్యదర్శి జగన్, నాగరాజు, కొండయ్య, ఫక్రుద్దీన్, నూరి, కిష్టా, వెంకటరమణ, శివ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి పనులు చేపడుతుండగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొంది. అయితే టిప్పర్‌పై విద్యుత్ తీగలు పడటంతో మంటలు చెలరేగాయి. మంటల్లో రోడ్డు పనులు చేపట్టడానికి వినియోగిస్తున్న టిప్పర్ పూర్తిగా కాలిపోయింది. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా తప్పించుకొన్నారు.

రైల్వేలైన్ పనులు పూర్తి చేయండి

మడకశిర: రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ పనులు వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం కూడా పంపినట్లు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న తుమకూరు లోక సభ ఎంపీ అయిన సోమన్నకు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి పదవి లభించడం హర్షణీయమన్నారు. అయితే కేంద్ర మంత్రి మడకశిర మీదుగా చేపట్టిన రాయదుర్గం - తుమకూరు రైల్వే లైన్ పనులను సత్వరమే పూర్తి చేసి సరిహద్దు ప్రజలకు కానుకగా ఇవ్వాలని కోరారు. రాయదుర్గం నుంచి పావగడ వరకూ రైల్వేలైన్ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. అదే విధంగా పావగడ నుంచి మడకశిర మీదుగా చంద్రబావి వరకూ రైల్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే మధుగిరి తాలూకా చంద్రబావి నుంచి తుమకూరు వరకూ రైల్వేలైన్ పనులు చాలా కాలం నుంచి ఆగిపోయాయని మంత్రికి పంపిన వినతిపత్రంలో వివరించారు. మిగిలిన పనులను పూర్తి చేస్తే మడకశిర నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే అన్ని విధాలుగా వెనుకబడిన సరిహద్దు ప్రాంతాలు కూడా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మడకశిర మీదుగా చేపట్టిన తుమకూరు రైల్వేలైన్ పనులను జాప్యం చేయకుండా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

కానరాని కాడెడ్ల వ్యవసాయం

- యంత్రాల ద్వారానే సేద్యం
- పనులు లేక వ్యవసాయ కూలీలు ఇతర పనులకు



ట్రాక్టర్‌తో పొలం దుక్కి చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పనులన్నీ కేవలం ఎద్దులతో మాత్రమే చేసేవారు. రానురాను సాంకేతికత పెరిగిపోవడంతో ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. గతంతో ముందస్తు వర్షాలు కురిస్తే పొలాలను ఎడ్లతో దుక్కి దున్ని పంటను సాగు చేసేందుకు అనువుగా చేసుకొనేవారు. గ్రామాల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు వేరుశనగ కాయల నుంచి విత్తనాలను వేరుచేసే పనులలో నిమగ్నమయ్యేవారు. అయితే ప్రస్తుతం వాటి స్థానంలో యంత్రాలు వచ్చాయి. గతంలో విత్తనాలను సాగు చేయడం, పంటలో కలుపు మొక్కలను తొలగించడం, మందులను పిచికారీ చేయడం, పంటను తొలగించే పనులు కేవలం మనుషుల ద్వారానే చేసేవారు. ఇప్పుడు విత్తనం సాగు చేయడం నుంచి కలుపు తొలగించడం, మందులు పిచికారీ చేయడం పంటను తొలగించేందుకు అనేక రకాల పరికరాను ట్రాక్టర్లకు అమర్చుకొని మనుషులతో ప్రమేయం లేకుండా ఒకరిద్దరితోనే చేసుకుంటున్నారు.

తగ్గిన సేంద్రియ ఎరువులు

కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో వ్యవసాయం చేసే రైతుల ఇళ్ళ ముందు వ్యవసాయం చేసేందుకు ఎడ్లను, పాడి సంపద కోసం పాడి పశువులను పెంచి పోషించుకొనేవారు. వాటి ద్వారా వచ్చే పేడ, గోమూత్రంను ఎరువులుగా మార్చుకొని పంట పొలాలకు వాడే వారు. వీటిదారి పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండే వారు. నేడు విత్తనాలను నిల్వ చేసుకొనడం నుంచి పంటను సాగు చేసి పంట ఇంటికి చేరే వరకు అనేక రకాల రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ప్రస్తుతం పశువుల ద్వారా వ్యవసాయం చేసేవారు కనుమరుగయ్యారు. మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయానికి వాడే పశువులు లేక పోగా యంత్రాల ద్వారానే పంటలను సాగు చేసుకుంటున్నారు. రసాయన ఎరువుల ద్వారా పండించి పంటలను తింటున్న ప్రజలు రకరకాల వింత రోగాల బారిన పడుతున్నారు. నేడు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది.